## ‘ఉద్యోగాన్ని కర్తవ్యంగా భావించి సేవచేయాలి’

దామెర, అక్టోబర్ 12 : మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన అంకేశ్వరపు శ్రీకాంత్, అంబటి రాకేశ్, కడారి సురేశ్ సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ కాగితాల శంకర్ ఉద్యోగాలు పొందిన వారిని గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యోగం బాధ్యతతో నిర్వర్తించాలని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుంటూ వారికి సేవచేయడం కర్తవ్యంగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు తప్పవు

### సీఐ రవిరాజు హెచ్చరిక

ఆత్మకూరు, అక్టోబర్ 12 : గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐ రవిరాజు హెచ్చరించారు. అగ్రంపహాడ్ గ్రామానికి చెందిన ఎడ్ల కోమల్‌రెడ్డి బెల్టుషాపు నిర్వహిస్తుండగా గురువారం షాపుపై దాడి చేసినట్లు తెలిపారు. రూ.17,120ల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. అతని పై కేసు నమోదు చేశామన్నారు. సీఐ రవిరాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పందుల షెడ్ కూల్చివేతపై విచారణ

ఆత్మకూరు, అక్టోబర్ 12 : ఆత్మకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పందుల షెడ్ కూల్చివేతపై పరకాల ఇన్‌చార్జి డీఎల్పీవో సుదర్శన్ గురువారం జీపీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు దుగ్యాల రమేశ్, సర్పంచ్ పర్వతగిరి రాజు, పంచాయతీ సిబ్బంది, కార్యదర్శి వాంగ్మూలాలు వేర్వేరుగా తీసుకున్నారు. పందుల షెడ్, సెగ్రిగేషన్ షెడ్‌లను డీఎల్పీవో సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీవో చేతన్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

## ‘ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు’

శాయంపేట, అక్టోబర్ 12 : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి గోడలపై రాతలు రాసినా, బ్యానర్లు కట్టినా, పోస్టర్లు వేసినా కేసులు నమోదు చేస్తామని మండల మోడల్ కోడ్ అధికారి అమంచ కృష్ణమూర్తి హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 9న నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. నిబంధనల మేరకు గురువారం మధ్యాహ్నం వరకు గోడలపై ఉన్న వాల్‌రైటింగ్స్, పోస్టర్లు, బ్యానర్లు తొలగించినట్లు చెప్పారు. అనుమతి లేకుండా బ్యానర్లు, పోస్టర్లు వేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

## ‘చల్లా’ గెలుపు కోసం కృషి చేయాలి

గీసుగొండ, అక్టోబర్ 12 : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మూడో సారి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జూలూరి లెనిన్ అన్నారు. మండలంలోని కొమ్మాల, దస్రుతండా గ్రామాల్లో యూత్ నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మూడో సారి గెలువబోతున్నట్లు తెలిపారు. ధర్మారెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు వీరన్న, కుమార్, భద్రు, వీరేందర్ పాల్గొన్నారు.

## పత్తి పంటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి

### కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

సంగెం, అక్టోబర్ 12 : పత్తి పంటలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాజన్న తెలిపారు. సంగెం మండలంలోని గవిచర్ల గ్రామంలో గురువారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పత్తి పంట క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్తిపంటలో గులాబీ రంగు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పత్తిపంటలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయటం వల్ల ఎలాంటి కీటకాలు ఆశించవన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.



గవిచర్లలో పత్తిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



దామెర : ఊరుగొండలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



గీసుగొండ : కొమ్మాల జడ్పీ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు వేడుకలు
- తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా ఆడిపాడిన విద్యార్థులు

దామెర, అక్టోబర్ 12 : మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆనందోత్సహాల మధ్య ముందస్తు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. విద్యార్థినుల కోలాట నృత్యం ఆకట్టుకుంది. ప్రభుత్వం మన సంస్కృతీసంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునిత, విజయప్రభ, విద్యారాణి, విజయరాణి, రజిత, డాక్టర్ రాచర్ల గణపతి, రవీందర్ రెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

**శాయంపేటలో..**

శాయంపేట, అక్టోబర్ 12 : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం బతుకమ్మ..బతుకమ్మా అంటూ సంబురంగా ఆడిపాడారు. ఉపాధ్యాయులు బతుకమ్మ సంబురాల్లో భాగస్వాములయ్యారు.



శాయంపేట : సర్కారు బడిలో బతుకమ్మను పేరుస్తున్న బాలికలు



ఆత్మకూరు : అగ్రంపహాడ్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

**ఆత్మకూరులో..**

ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందుస్తుగా గురువారం రోజున బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు.మండలంలోని అగ్రంపహాడ్,చౌళ్లపల్లి,ఆత్మకూరు,నీరుకుళ్ల,అక్కంపేట పాఠశాలల్లో బతుకమ్మలను పేర్చి,ఆటపాటలతో బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గీసుగొండలో..**

గీసుగొండ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాఠశాల ఆవరణలో పెట్టి ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నడికూడ: చర్లపల్లిలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, ఉపాధ్యాయులు

### చర్లపల్లిలో బతుకమ్మ సంబురాలు..

నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శ్రీసాయి ట్రస్టు హనుమకొండ వారి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను హెచ్ఎం అచ్చ సుదర్శన్ గురువారం ఘనంగా నిర్వహించారు. ట్రస్టు నిర్వాహకులు వేముల ప్రభావతి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ అని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి పాఠశాల వేడుకల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను లావణ్య, పావని, మధువాణిలకు, కన్సోలేషన్ బహుమతులను లలిత, సౌజన్యలకు అందించారు. వారికి ట్రస్టు ద్వారా పట్టు చీరెలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజేందర్, నిగ్గుల శ్రీదేవి, పీ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియకు సహకరించాలి

- కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు అందించాలి
- ర్యాలీలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి
- విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు
- ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ములుగు టౌన్, అక్టోబర్ 12 : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుగు జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని, కోడ్ ఉల్లంఘనలపై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 24 గంటలు నమోదు చేయవచ్చని తెలిపారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేసినా, తప్పుడు ప్రచారాలకు పాల్పడినా ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం అభ్యర్థులపై ఆరేళ్ల నిషేధం ఉంటుందన్నారు. అక్టోబర్ 31 వరకు నూతన ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, జాబితాలో పేర్లు లేకుండా ఎవరైనా అర్హులైన ఓటర్లుంటే వెంటనే సమర్పించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీల నిర్వహణ కోసం ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని ఇలా త్రిపాఠి సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డీఎస్ వెంకన్న, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, అనిస్ ఫాతిమా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి

**ఈవీఎం గోదాం తనిఖీ**

త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంను గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. రాజకీయ ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ తీసి ఈవీఎం లు, వీవీ ప్యాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గోదాం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ వెంకన్న పాల్గొన్నారు.

## ‘అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి’

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 12 : అసాంఘిక శక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై రేఖ అశోక్ అన్నారు. గురువారం మండలంలోని కొండాపురం జీపీ పరిధిలోని బస్తరుగుంపు గ్రామంలో పోలీసులు, సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా గ్రామంలో సంచరిస్తే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.